


రైలు మా ఊరుని సమీపిస్తున్న కొద్దీ నా మనసు మరీ మరీ ఉవ్విళ్ళూరి పోతోంది. అమ్మని విడిచిపెట్టి రెండునెలలే అయినా ఎన్నో యుగాలు గడచిపోయి నట్టయింది. అసలు ఏ పరిస్థితుల్లోనూ అమ్మని విడిచి ఉండటం నా కిష్టం లేదు. పేరుకి మూడురోజుల శలవలని బయలు దేరాను. ఈ మూడు రోజులు మాత్రమే ఉండాలని రూలుందా ఏమిటి? తిరిగి ఆ దిక్కుమాలిన ఊరికి వెడితే గదా!

అన్ని బట్టలూ మూట కట్టేస్తూంటే పోల్చలేదుగాని మడతమంచం కూడా పేక్ చేసేస్తూంటే మా రూమ్ మేటు అడక్కుండా ఉండలేకపోయాడు. "అదేమిటోయ్ మురళీ, మడతమంచం కూడా పట్టుకుపోతున్నావేమిటి యీ మూడ్రోజుల భాగ్యానికి?"

"అవునోయ్....గుడ్డ చిరిగిందీ........ అక్కడ మంచి కేన్వాసు గుడ్డలు దొరుకుతాయి. చిన్న రిపేరు కూడా ఉంది. చేయించి

తీసుకొస్తాను" అని ఎలాగో సర్దిచెప్పేను. అన్నయ్య స్టేషనుకి, నన్ను దిగబెట్టడానికి రాకపోడం, ఒక అదృష్టం. సుబ్బరామయ్య గారని, ముందురోజు అన్నయ్య అప్ప చెప్పేడే నాతో ప్రయాణానికని, ఆయన్తో కూడా ఇలాగే అబద్ధ మాడవలసి వచ్చింది.

ఎందరితో ఎన్ని రకాల అబద్ధాలాడినా ఏమాత్రం బాధపడవలసిన అవసరం నాకేం కనపడలేదు. నేను నిజం చెప్పవలసిన వ్యక్తి, నన్ను అర్థం చేసుకుని ఆదరించే వ్యక్తి, యీ ప్రపంచంలో ఒక్కర్తే ఉంది. వెళ్ళగానే చెప్పేస్తాను 'అమ్మా, నేను నీ దగ్గిర తప్ప యింకెక్కడా వుండలే'నని.

అసలు పొరుగూరిలో నన్ను చదువుకి పంపిస్తారని తెలిసీ తెలియగానే నే నెంత అల్లరి పెట్టేనని! ఎక్కడి కక్కడే నాన్న గారు కొట్టి పారేశారు. "మే మెందు కింతగా చెబుతున్నామో, ఆ మాత్రం అర్థంచేసుకోకపోతే ఎలారా బుజ్జీ? ఏం, యింకా చిన్న పాపాయి ననుకుంటున్నావా? ఈ నాగులచవితికి పదహారూ వెడతాయి తెలుసా నీకు? స్ట్రయికులూ, అల్లర్లూ నానా ఛండాలంగానూ తయారవుతోంది, యీ ఊళ్లో కాలేజీ, రోజురోజుకీ. అక్కడయితే అన్నయ్య ఉంటాడు" ఉద్ధరించాడు- అన్నట్టు కోపంగా వాడివైపు చూసి—— 'అమ్మా నా మనసు నీకు తెలీదుటే, నిన్ను విడిచి ఉండ గలనటే, నువ్వేనా చెప్పవే నాన్నతో' అన్నట్టు ఆశగా అమ్మ వైపు చూశాను.

"అవున్రా బుజ్జీ, అన్నయ్య నీకు సాయంగా ఉంటాడు. ఏ బెంగా ఉండదు, చక్కగా చదువుకుని గొప్పవాడ వవుదువు గాని" అంది.


ఆనాడు స్టేషనులో- అమ్మని వదిలిపెట్టి రాలేక-హోరని ఏడ్చేశాను. బలిపశువుని తోసినట్టు నన్ను రైల్లోకి తోసి, అన్నయ్య గుమ్మాని కడ్డంగా నిలుచున్నాడు. అటు వైపు తిరిగి అమ్మ చీరకొంగుతో కళ్ళద్దు కోడం నేను చూశ్శేదనా!

"బుజ్జీ, పై ఊళ్ళో కాలేజీ చదువులు చదువుకోడానికి వెడుతున్నావు........అలా ఏడిస్తే నలుగురూ నవ్వరూ! ఛ, తప్పు నాన్నా, మళ్ళీ శలవలకి వచ్చేస్తావుగా!"

"వీడూ, వీడి ఆడారి బుద్ధులూ చూసి మధ్యని నన్నేం ఏడిపించుకు తింటారో ఏమిటో మా ఫ్రండ్సు"అన్నాడు అన్నయ్య. అమ్మ దెబ్బలాడింది.

"చూడు రాజూ, తమ్ముడు నీ కంటే అయిదేళ్ళు చిన్న. కంటికి రెప్పలా చూసు కోవాలి గాని నువ్వే అలా బెదరగొట్టేస్తే ఎలా! ఇంతకీ పేరుకి పదిహేనేళ్ళు వెళ్ళేయి గాని ఏ పదమూడేళ్ళ గుంటడిలాగే కనిపి స్తున్నాడు. మీ నాన్నగారు పట్టు పట్టేరని ఎలాగో సరిపెట్టుకుని ఊకొట్టేను గాని నా ప్రాణాలన్నీ వాడిమీదే ఉంటాయి. పొరు గూరు కాదు సరికదా, పొరుగింటికైనా వెళ్ళి ఎరగనంత వెర్రి నాగమ్మ వాడు. ఎలా చూసుకుంటావో ఏమో!"

రైలు నడుస్తూనే ఉంది. అమ్మ చెయ్యి ఊపడం కనిపిస్తూనే వుంది. ఎంత అప్ప




కుందామన్నా లోపల్లోపల్నుంచి పొంగి పొరలి అలా దుఃఖం నాకు వస్తూనే ఉంది.

నన్ను హాస్టల్లో చేర్పించి, ఒకరిద్దరు తనకి తెలిసిన సీనియర్ స్టూడెంట్సుకి అప్పజెప్పి అన్నయ్య తన పోస్టు గ్రాడ్యుయేట్ హాస్టలుకి వెళ్ళిపోయాడు. ఆ హాస్టల్లో మొదటి నెల్లాళ్ళూ నేను పడ్డ బాధ వర్ణించలేనిది. ఇంటి దగ్గరయితే దేనికయినా అమ్మ నా కూడా ఉండేది. నాన్నగారేమో రోజురోజంతా ఆఫీసులోనే ఉండిపోయేవారు. నాకు జ్ఞాన మొచ్చిం దగ్గిర్నుంచీ అన్నయ్య పొరుగూర్లో హాస్టల్లోనే ఉండేవాడు. నాకు అమ్మ ఒక్కతే కాదు, అమ్మకి కూడా నేను ఒక్కణ్ణే అన్నట్టు ఉండేది. అన్ని పనులూ చేసిపెట్టేది.

ఇక్కడ నా కెవరున్నారని! నాకు సరిగ్గా పాపిడి తీసుకుని తల దువ్వుకోడం రాదు. వీపు రుద్దుకోడం రాదు. స్నానం చేసిన తువ్వాలు ముడతలు రాకుండా ఆరేసుకోడం రాదు. విప్పిన బట్టలు నీటుగా స్టేండుమీద పెట్టుకోడం రాదు. నిక్కరుకయినా గుండీలు ఊడిపోతే అమ్మ వచ్చి పిన్నీసు పెట్టవలసిందే. డ్రాయరు బొందు పీటముడి పడిపోయినా అమ్మ వచ్చి విప్పవలసిందే. ఏ పనీ చేసుకోలేక ఎంత తికమక పడిపోయాను నేను. నా చేతకాని తనం పసిగట్టి నలుగురూ ఏడిపిస్తూ ఉంటే నా బెంగ రోజు రోజుకీ ఎక్కువైపోయేది. ఓ రోజూ కడుపునిండా తిని ఎరగను. ఓ రాత్రి కంటి నిండా నిద్రపోయి ఎరగను.

అయిదోరోజు సాయంత్రం అన్నయ్య వస్తే చెప్పేను:

"ఒరే అన్నయ్యా, ఇక్కడ వుండ లేకుండా ఉన్నాన్రా నేనూ! అమ్మ దగ్గరకి వెళ్లిపోతాన్రా. బాబ్బాబు నీకు పుణ్యముం టుంది, నన్ను పంపించెయ్యరా!" అన్నాను కళ్ళనీళ్ళ పర్యంతమై....


"ఒరే, ఒరే....ఇంతింత ఆడగుంటలు పై ఊళ్ళలో కాన్వెంటు స్కూళ్ళలో చదువుకుంటున్నారా! సిగ్గు లేదుట్రా? ఈ హాస్టల్లోనే చూడు. నీ కంటె చిన్నపిల్ల లున్నారు. వాళ్ళకి మాత్రం తల్లీ తండ్రీ వుండరూ? లేచి నలుగురితో తిరుగు. ఆడక పోయినా ఆటలయినా వెళ్ళి చూడు. మా కందరికీ మాత్రం మొదట్లో నీలా బెంగగా లేదంటావా? అదే అలవాటవుతుంది. మినర్వాలోకి కొత్త సినిమా వచ్చిందిట, వెళ్ళకూడదూ?"

అన్నయ్య మాటలు ఏవిధంగానూ నాకు ఓదార్పు యివ్వలేదు. ఒకళ్ల ఊసు నా కెందుకు? నా బాధ నాది....ఒకళ్ళ అమ్మకీ మా అమ్మకీ పోలికేమిటి! మా అమ్మ నాది.

అన్నయ్య వెళ్ళిపోయాడు. భోజనాల బెల్ అయింది. తినాలని బుద్ధి పుట్టలేదు. రూంలో లైటయినా వెయ్యకుండా కూచు న్నాను. మా రూంమేటు వచ్చాడు. "అరె, మురళీ, అలా కూచున్నావేమోయ్, ఒంట్లో బాగు లేదా? నీకీ హాస్టలు మీల్సు పడ్డం లేదా ఏమిటి కర్మ? ఇవాళ హాస్టలు ఇనాగ రేషన్ డే కదా, మరచిపోయావా? స్పెషల్ ఐటమ్స్ సెర్వ్ చేశారు. అల్లం పెసరట్లు వేశారు. అబ్బ, మార్వలెస్! స్వీట్ ఏమిటో తెలుసా? జిలేబీ! ఎంత బాగా కుదిరిందను కున్నావ్! వెంటనే వెళ్లు. వేడిమీద తినేస్తేనే రుచి....ఆలశ్యం అయితే అసలుకే మోసం రావొచ్చు," నవ్వుతూ కిళ్ళీ వేసుకొస్తానని వెళ్ళిపోయాడు. అతను వేసిన లైటు వెంటనే ఆర్పేశాను. నాకు చీకటే బాగుంది. పెసరట్లూ, జిలేబీలూ ఇలాంటివి తింటు న్నంత సేపూ బాగానే ఉంటాయి. కాని మనిషి బతికున్నంతకాలం జ్ఞాపకం తెచ్చు కుని ఆనందించే మధురమైన రుచులు కొన్నే ఉంటాయి. వీళ్లకేం తెలుసు! ముసుగు తన్నేసి పడుకున్నాను.

హాస్టల్లోనూ, కాలేజీలోనూ నన్నుబాగా ఏడిపించడం ప్రారంభించారు. చంటి పిల్లాణ్ణి నవ్వించినట్టు నన్ను చూడగానే 'ఛీ ఛీ, దోబూచీ' అని అల్లరి చెయ్యడం 'దాయ్, దాయ్, పాపాయ్, ఏదమ్మా చంద మామ ఏదీ?' అని పాటలు పాడ్డం.... 'చను బాలుడు' అని మారుపేరు పెట్టేరు. పుండు మీద కారం జల్లినట్లు యీ గొడవ భరించడం మరీ కష్టమైపోయింది. నాకు. ఓనాడు అన్నయ దగ్గిర కెళ్ళి చెప్పు కుని గోల పెట్టేను.

"ఒరే, యింకా మీ వాళ్ళు 'అనాగ రికులు' కాబట్టి ఇంతటితో సరిపెట్టేరు. మా యూనివర్శిటీ హాస్టల్లో ఏ జూనియర్ స్టూడెంటు చేరినా పెట్టే అల్లరికి అంతూ పంతూ ఉండదు. ఒంటిమీద గుడ్డలుంచరు. నిలువెల్లా తడిపేస్తారు. ఇంకా నయం, సంతోషించు. అయినా నీ ప్రవర్తన



మాత్రం ఏం బాగుందిరా? ఎన్నాళ్ళయినా రూం దాటి యివతలకి రావు. కళ్ళల్లో ఆ పిరికితనం ఎన్నాళ్ళయినా తగ్గించుకోవు. అమ్మా, అమ్మా అంటూ పలవరించక మానవు. నిన్ను ఏడిపిస్తే వాళ్ళదా తప్పు?"

ఇదీ, అన్నయ్య చెప్పిన ధైర్యం! ఇక ఆ రాత్రి ఆలోచించి ఆలోచించి ఒక నిశ్చయానికి వచ్చేశాను. ఆ అర్ధరాత్రి వేళ కూచుని అమ్మకి పెద్ద వుత్తరం ఒకటి రాశాను. ఏ విధంగా సరిపెట్టుకుందామనుకున్నా ఇక యిక్కడ వుండలేక పోతున్నాననీ, నా ఆరోగ్యం ఎంత మాత్రం బాగులేదనీ, ఇక్కడ చదువు యిక నాకు కుదరదనీ-వెంటనే నాన్నగారిని పంపించి నన్ను యింటికి తిరిగి తీసుకు వెళ్లే ప్రయత్నం చెయ్యమనీ-ఇంకా ఏవేవో రాశాను. అమ్మ తన చేత్తో తను ఎడ్రసు రాసిచ్చిన కవరు ఒకటి పెట్టి అడుగున దాచాను. వెతికి తీశాను అది. వరండా చివర్న గేటు దగ్గిర పోష్టు బాక్సు ఉంది. అన్నయ్య కిస్తే పడేస్తాడని నమ్మకం ఏమిటి? అంత రాత్రివేళా నేనే స్వయంగా వెళ్ళి పోస్టుచేసి వచ్చాను. హాయిగా గుండె మీద చెయ్యి వేసుకుని పడుకున్నాను.

ఆ మర్నాటి నుంచి ఇది ఎప్పుడు అమ్మకి చేరుతుందా, ఎప్పుడు జవాబు వస్తుందా, ఇదే ఆలోచన. వారం గడిచింది గాని ఎలాంటి కబురూ లేదు. ఆ ఆదివారం అన్నయ్య వచ్చాడు. నా ఉత్తరం మొదట అందుకున్నది నాన్నగారుట. చాలా కోపం వచ్చిందట ఆయనకి. 'నెలరోజులు గడిచాయంటే ఎలాగో అలవాటు పడిపోయాడనుకున్నాం, ఇదా వీడి వరసా?' అని చాలా బాధపడ్డారుట. 'నువ్వుండి ఏం పాటుపడుతున్నావ్? అంత చేతకాకపోతే వెంటనే వాణ్ణి రైలెక్కించరాదూ?' అని

అన్నయ్యని చీవాట్లుపెడుతూ పెద్ద ఉత్తరం రాశారుట. ఆ మంట అంతా నా మీద చూపించాడు అన్నయ్య. 'అమ్మ కూడా కూడా తిరిగి వంటయినా నేర్చుకో. ఎక్కడయినా వంట పూటిగానైనా కుదురుకో వచ్చు.....నీ మొహాన్ని అలాంటి రాతే వుండగా, ఎవరెంత చెబితే బుద్ధి వస్తుంది గనక నీకు? నాతో మాటమాత్రమైనా చెప్ప కుండా అమ్మకి అలాంటి ఉత్తరం రాశావే, యింక నీకు బుద్ధి చెప్పేదేమిటి నేను!' ఇలా అడ్డమయిన మాటలూ అని వెళ్ళేడు. ఇన్ని మాటలు పడ్డానికి ఏం పాపం చేశానా అని కళ్ళనీళ్ళు తిరిగాయి నాకు. అక్కణ్ణుంచి వచ్చెయ్యడమే నేను చేసిన పెద్ద తప్పు అనిపించింది.

రోజులు ఎలాగో గడుస్తున్నాయి. గడపక ఆగిపోతాయా? అమ్మ ఆలోచనలు కొంచెం పక్కకు నెట్టి అటూ యిటూ చూడ్డానికి ప్రయత్నించ సాగేను. అయినా ఓడిపోయేవాణ్ణి. అమ్మను తీసి పక్కకి పెట్టవలసిన అవసరం ఏమిటో ఎంత ఆలోచించినా నాకు బోధ పడలేదు. నలుగురిలో ఉన్నప్పుడు ఎలాగో అమ్మ మాట మరచిపోయేవాణ్ణి గాని ఒంటరిగా వున్నప్పుడు, ముఖ్యంగా నిద్ర పట్టక ముందు, అమ్మ దగ్గిరలేని బాధ నన్ను క్రుంగదీసేది. కిటికీలోంచి వచ్చే తెరలు తెరలు చల్లని గాలీ, ఆకాశంలో దూరంగా మెరిసే మినుకు మినుగు చుక్కా, అమ్మ సంగతే నాకు గుర్తు చేసేవి. అమ్మ పక్కలో కూచుని వీపు నిమురుతూ ఏవేవో తియ్యని భోగట్టాలు చేస్తున్నట్టు ఉండేది:

'బుజ్జీ, కులాసాగా వున్నావా అమ్మా! భోజనం అదీ సరిపడుతోందా? రాత్రి పడుకోబోయేముందు కాడ్ లివర్ ఆయిల్ మరచిపోకుండా తాగుతున్నావా? డబ్బు సరిపోతోందా, ఇంకా పంపమని నాన్నకి చెప్పమన్నావా? అన్నం దగ్గిర కూచుని అన్నీ అడిగి వేయించుకుంటున్నావా, మొహమాట పడి అర్ధాకలితో లేచిపోతున్నావా?'

ఎందుచేతోగాని యిన్నాళ్ళయింది, అమ్మ ఒక్క ఉత్తరం రాయలేదు. కాని ప్రతిక్షణం నాతో మాట్లాడుతున్నట్టే ఉంటుంది:

'నీ రూమ్ మేటు నడుగు, నీకేదైనా కావలిస్తే ఎక్కడ దొరుకుతుందో చెబుతాడు. భయపడకుండా మీ లెక్చెరరు నడుగు, నీకు అర్థం కానిది బోధపరుస్తాడు. నీకేం కావలసినా అన్నయ్య నడుగు, నాన్నగారికి రాస్తాడు.'

అమ్మా, నేనెవర్నీ ఏమీ అడగనని నీకు తెలీదా? నాకు కావలసింది నువ్వే, నువ్వేననీ, అడక్కుండా గ్రహించి యిచ్చేది అమ్మ ఒక్కర్తేననీ అలవాటు చేసిన నీకే తెలీదా అమ్మా-అని ఏడ్చుకునే వాణ్ణి.

కాలేజీలో ఏవో క్వార్టర్లీ స్పోర్ట్సుట జరిగేయి. మూడు రోజులు మాకు శలవలిచ్చారు. ఆ కబురు తెలిసీ తెలియగానే ఒక నిశ్చయానికి వచ్చేశాను నేను. అమ్మని చూసి రావాలి. రావాలి ఏమిటి నా మొహం.

రాను. నన్ను చంపినా సరే, అమ్మని వదలి రాను. రాను గాక రాను. రాలేను. అక్కడే చదువు కుంటాను. రెణ్ణెల్లు అయిపోయిం దని సీటు దొరక దంటారా? కానియ్యి.... కొంపేం మునిగిపోయింది లేదు. ఆ మధ్య జబ్బుచేసినప్పుడు ఓ ఏడాది చదువుపోలేదూ? ఏడాది పాటూ యింట్లో హాయిగా అమ్మ దగ్గిరే ఉండిపోలేదూ? ప్రతీ ఏడాదీ యిలాగే జబ్బుచేస్తే ఎంతో బాగుణ్ణని వెయ్యి దేవుళ్లకి మొక్కుకోలేదూ!

కానీ, ఏ రెణ్ణెల్లలో నేనూ కొంచెం తెలివి తేటలు నేర్చుకున్నాను. ఏకంగా అక్కడ ఉండి పోడానికంటే నన్ను చస్తే యిక్కణ్ణుంచి కదల నియ్యరు. ముందు అక్కడ చేరిపోతే తర్వాత ఆలోచించవచ్చు. మా కిలా శలవ లొస్తున్నాయని పదిహేను రోజుల ముందుగానే చూచాయగా తెలిసింది. ఓసారి చూసి వస్తానని ఆ కబురు తెలిసిన నాడే అన్నయ్య దగ్గర పేచీపెట్టేను. 'ఈ మూడు రోజుల శలవలకీ అంతదూరం శుద్ధ దండుగ' అని ఒక్క మాటతో కొట్టి పారేశాడు. ఏడుస్తూ కూచున్నాను. అమ్మకి అవాళే రాసి పడేశాను. ఇక రేపట్నుంచి శలవలు అనగా ఆనాడు తేలింది నా ప్రయాణం మాట. "సుబ్బరామయ్యగారు, ఎవరూ, నాన్నగారి ఫ్రండు, తెలుసుగా నీకు? రేపు ప్యాసింజరులో ఆయన మన ఊరిమీంచే వెడుతున్నారు. ఆయన్తో నిన్ను పంపించమని నాన్నగారు రాశారు. నేను స్టేషనుకి రానక్కర్లేదుగా?" అన్నాడు అన్నయ్య.


"ఉహుం" అన్నాను నా సంతోషాన్ని లోలోపలే దాచుకోడానికి ప్రయత్నిస్తూ.

"అమ్మ టీచరుగా పనిచేస్తోందిట, తెలుసా?"

నేను ఆశ్చర్యాన్నుంచి తేరుకోక ముందే అన్నయ్య చెప్పుకుపోయాడు.

"నువ్వు కూడా యిక్కడికి వచ్చేశావుగా, పాపం ఒక్కదానికీ యింట్లో ఏం తోస్తుంది? ఇక నాన్నగారా, పని ఎక్కువగా వుంటే ఒక్కొక్కరోజు రాత్రి భోజనం కూడా ఆఫీసుకే తెప్పించుకుంటా రాయి. ఒక్కర్తే యింట్లో కూచుని ఏం చెయ్యాలి? ఎప్పుడో చిన్నప్పుడు పాస యిన మెట్రిక్ ఇప్పటికి పనికొచ్చిందన్న మాట. ఆయనే రికమెండ్ చేయించి వేయించారుట, అమ్మకి ఉద్యోగం, నాన్నగారు రాశారు!"

ఎందుకో చెప్పుకోలేకపోతున్నానుగాని, ఆ వార్త నాకేమీ తృప్తికరంగాలేదు. నాన్నగారు చెబితే చెప్పేరుగాని, తగుదునమ్మా అని నువ్వెలా ఉద్యోగంలో చేరేవే అమ్మా? అసలు ఉద్యోగం చెయ్యడం వచ్చా నీకు!? అన్నయ్య వెళ్ళిపోగానే ఆ కబురు అప్పుడే మరచి పోయాను. ఇంటి కెళ్ళిపోతున్నా నన్న సంబరంలో ఒంటిమీద స్పృహే లేదు నాకు. నిజానికి యీ మూడ్రోజుల భాగ్యానికీ ఒక సంచీ చాలు నాకు. ఒక్క సామాను యిక్కడ ఉండనియ్యకుండా అన్నీ కట్టేశాను.



ఎలాగయితేనేం, జైలు శిక్ష పూర్తయినట్టు, హాస్టలు అనుభవానికి యిక గుడ్‌బై అనుకుని, రైల్లో కూచున్నానేగాని ఉరిశిక్ష లాంటి రైలుప్రయాణాన్ని ఎలా తప్పించుకోగలను! స్టేషను కాని చోట రైలు ఆగేసరికల్లా నా గుండె ఆగిపోయినంత పని అయేది. అందులో మావూరు ఔటర్‌సిగ్నల్ ముందు గంటయినా ఆగిపోయి ఉంటుంది. దిగి, పరిగెత్తి, స్టేషన్లో నా కోసం గంటల దరబడి ఎదురు చూస్తున్న అమ్మ చేతుల్లో వాలిపోవాలి. 'నీ కోసం మొహం వాచిపోయానే అమ్మా! చదువూ వద్దు, చట్టుబండలూ వద్దు, నన్నెక్కడికీ పంపకే అమ్మా!' అని అమ్మని చుట్టు పెట్టుకుని బావురుమని ఏడవాలి. నన్ను చూసి సుబ్బరామయ్యగారు నవ్వితే నవ్వేరుగాక. నే చేసేది చెయ్యక మానను. అలా చెయ్యకుండా ఉండలేను కూడాను. మా అమ్మ కోసం. అవును మా అమ్మ అది....ఏడుస్తాను, నవ్వుతాను....నా యిష్టం....ఈయనెవరు మధ్య!

ఎలా అయితేనేం రైలు కదిలింది గుమ్మం దగ్గర నిలబడ్డ పెద్ద పెద్ద వాళ్ళ కాళ్ళ మధ్యనుంచి తలదూర్చి నెమ్మదిగా

ముందుకి చేరుకున్నాను. పొట్టిగా యింతున్నాను, అమ్మ కంట పడకుండా ఎక్కడ అయిపోతుందో అని మరీ ముందుకి వచ్చేశాను. ఇంత మొహం చేసుకుని, అంతంత కళ్ళు చేసుకుని మా అమ్మ నాకోసం ఎంత సేపై వెదుకుతోందో!

"మీ అన్నయ్యరాసిన ఉత్తరం అందలేదేమోనోయ్ మురళీ! లేపోతే రాకుండా ఉంటారా? అరె! బెల్ కూడా అయిపోయింది! సామాన్లు అందిస్తాను, ఒకటీ ఒకటీ దింపుకో...."

పాపం సుబ్బరామయ్యగారు చాలా సాయంచేశారు. సామాన్లన్నీ దింపిపెట్టేరు. ఎంతో ఆశాభంగంతో ఎలా దిగేనో దిగేను. రైలు కదిలిపోయింది. దిగులుగా నిలబడిపోయాను. దూరంనుంచి మా నౌఖరు వీరాస్వామి పరిగెత్తుకు రావడం కనిపించింది.

"బుజ్జిబాబుగారూ, వచ్చేశారా? దార్లో సైకిలు గాలిపోయింది. ఆలశ్యమైపోయింది. ఇంకా ఆలశ్యమైతే నా కొంప మునుగును. రండి రండి. ఏకంగా ఇన్ని సామాన్లు తెచ్చేశారేమిటి? పెద్దబాబు బాగున్నారా?"

చెప్పేను ఏవో జవాబులు. అమ్మకి ఉత్తరం అందకపోయి ఉండాలి. ఆ మాట వీరాస్వామి చెబితే బాగుణ్ణు. ఉత్తరం అందకపోతే ఫలానా రైలుకి నేను వస్తున్నట్టు ఎలా తెలిసింది వీళ్లకి? వీరాస్వామిని ఎలా పంప గలిగేరు? ఉత్తరం అందికూడా అమ్మ స్టేషనుకు రాలేదనడానికి వీరాస్వామి సజీవ సాక్ష్యం. వాడిమీద ఒళ్ళుమండింది. వాణ్ణెవరు రమ్మని ఏడిశారు స్టేషనుకి?

నా చేతిలో ఎక్సర్ సైజు బుక్ గాలికి రెపరెప కొట్టుకుంది. నన్ను చూసి నవ్వినట్టయింది. పరిశుభ్రత గురించి తెలుగు క్లాసులో వ్యాసం రాయించారు. అందులో అందరికన్న ఎక్కువ మార్కులు వచ్చింది నాకే. పదికి తొమ్మిది పడ్డాయి, వెరీ గుడ్ అన్న రిమార్కుతో సహా. ట్యూటర్ నన్ను అడిగారు కూడాను 'మళ్ళీ చూస్తే పైకి అంత శుభ్రంగా కనపడవ్, ఇంత డిటెయిల్డ్‌గా, కరెక్ట్‌గా ఎలా రాయగలిగావోయ్ పరిశుభ్రత గురించి?' అని. 'ఇక్కడ కాదు, నా పరిశుభ్రత గురించి మీరు మాట్లాడేది, మా వూరు రండి, మా యింటికి రండి, మా అమ్మ నడగండి' అని చెప్పాలనిపించింది గాని నవ్వి ఊరుకున్నాను బాగుండదని. ఆ బండెడు సామాన్లలో ఎక్కడ కలిసిపోతుందో అని ఎక్సర్ సైజు బుక్ వేరే పైకి తీసిపట్టుకున్నాను. వెరీ గుడ్ అన్న అక్షరాలు అమ్మకి చూపిద్దామని ఎంతో మురిసిపోయాను. ఏదీ అమ్మ? ఎందుచేత రాలేదు? కళ్ళలో నీళ్ళు తిరిగేయి. ఆ పుస్తకాన్నే గొట్టంలా చుట్టి వీరాస్వామి కాలి మీద చచ్చేలా కొడదామనిపించింది.

"ఈ కొద్ది రోజులకే అంతగా నీరసించి పోయారేమిటి బుజ్జిబాబుగారూ, భోజనం సరిపడలేదా?" అన్నాడు వీరాస్వామి సామాన్లు జట్కాలో సర్దిస్తూ. రావలసిన వాళ్ళు అడగవలసిన ప్రశ్న ఇది.

అదిలేదు, ఈ దరిద్రగొట్టు కెలకడం ఒకటా? నా ఒళ్లు భగ్గుమని మండింది.

"నాకేం వీరాస్వామీ, దుక్కలా ఉన్నాను. నువ్వేం బొత్తిగా అలా గాలి వీస్తే ఎగిరి పోయేలా తయారయ్యావ్, ఎన్ని నెలలు జబ్బు పడ్డావేం?" అని అడిగేను. ఏమనుకున్నాడో మళ్ళీ యింటి కెళ్లే దాకా మాటాడలేదు వాడు.

మా వీధి మలుపు తిరిగేసరికి ఇక ఆగ లేకపోయాను. దూరదూరంనుంచే నేనెరిగినవన్నీ నన్ను ఆప్యాయంగా పలకరించి నట్లయింది.

'ఏం బుజ్జీ వచ్చేశావా?' అని అడిగింది ఇటిక రంగు గేటు.

'ఎప్పుడొచ్చావ్ నేస్తం?' అంది ముంగిట్లో గున్నమామిడి చెట్టు.

'రావయ్యా బుజ్జిబాబూ' అని ఆహ్వానించింది వీధి గుమ్మం కర్టెన్.

'అలాగేనర్రా, మిమ్మల్నందర్నీ పేరు పేరునా పలకరిస్తాను లెండి. ముందు మా అమ్మని చూడనియ్యండి' అన్నట్టు జవాబు చెప్పి, లోపలికి, ఇంకా లోపలికి, అమ్మ దగ్గిరకి, అమ్మ ఒడిలోని కన్నట్టు, పరిగెత్తేను.

గది తలుపు తాళం!

వీరాస్వామి తాళాల గుత్తి యిచ్చాడు. పక్క గదిలో సామాన్లన్నీ పెట్టించాడు. బండి వాడికి డబ్బు లిచ్చి పంపేశాడు.


"నేనువస్తా బుజ్జిబాబుగారూ! ఆలశ్యం చేస్తే మళ్లీ పెద్దయ్యగారు దెబ్బలాడుతారు. మళ్ళీ మధ్యాహ్నం వచ్చేస్తాను లెండి కావలిస్తే."

"ఏం అక్కర్లేదు. వెళ్లు."

వాడు వెళ్ళిపోయాడు. గదిలో టేబిల్ మీద ఎదురుగా కేరేజ్ కింద ఎగురుతున్న కాగితం మడత కనిపించింది. విప్పి చూశాను ఆత్రతగా. "బుజ్జీ, స్కూల్ వర్క్ ఎక్కువగా ఉండి స్టేషనుకి రాలేక పోయాన్రా....కులాసాగా యిల్లు చేరుకున్నావ్ కద....వీరాస్వామిని హోటల్ నుంచి కేరేజ్ తెచ్చి ఉంచమన్నాను. కడుపు నిండా భోంచేసి ఓ గడీ పడుకో సాయంకాలానికల్లా వచ్చేస్తానుగా?—అమ్మ.!'

ఊళ్ళోకి వచ్చినా ఉత్తరం తప్పలేదు నాకు. ఇంటికి వచ్చినా హోటల్ మీల్సు తప్పలేదు నాకు. అనుకున్న చోటికి చేరుకున్నా అమ్మ మొహం కనపడలేదు నాకు!

ఉత్తరాన్ని యింతింత ముక్కలకింద చింపేసి కిటికీ లోంచి విసిరేశాను. రెండు నెలల్నుంచి రాత్రి పగలూ అనకుండా యీ క్షణం కోసం ఎదురు చూశాను. ఇందుకేనా? 'ఇప్పుడు పదకొండున్నర అయింది. సాయంకాలం ఏడయిందింటికో దయచేస్తావు కాబోలు అమ్మా నువ్వు. పోన్లే, రాకపోతే మాత్రం ఏం మించిపోయింది! అసలు రావద్దు లేవే! నువ్వొచ్చేసరికి నా మూడు రోజుల శలవులోనూ ఒకరోజూ అయే అయిపోతుంది. ఎల్లుండి సాయంకాలం వస్తే సరీ! ఆ వేళకి ఎలాగా నేను తిరుగు



ప్రయాణంలో ఉంటాను....బాగా బుద్ధి చెప్పేవే అమ్మా!'

ఎంత తుడుచుకున్నా చెంపలు తడిసి పోయాయి. చొక్కా కాలరు ముద్దయి పోయింది. అప్పుడు జ్ఞాపక మొచ్చింది, రైలు బట్టలయినా మార్చలేదని, గుక్కెడు మంచి నీళ్లయినా తాగలేదని. లేచి కూచు న్నాను. నేనెలా ఉంటే ఎవరిక్కావాలని పించింది. అవాళ అమ్మచేత వీపుతోమించు కుందా మనుకున్నాను. పాపిడి తీయించు కుందా మనుకున్నాను. అలా జరగనప్పుడు ఆ పనులు చేస్తేనేం, మానేస్తేనేం!

వీధిలో జీపు ఆగిన చప్పుడయింది. నా గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. అది నాన్నగారి ఆఫీసుది. ఆ హారన్ నాకుగుర్తే. గబగబా కన్నీళ్ళు తుడుచుకున్నాను. బూట్ల చప్పుడు దగ్గిరయింది. తలుపు తెరుచుకుంది.

"ఎంత సేపయింది మురళీ వచ్చి? వీరా స్వామి స్టేషను కొచ్చాడా'"

నేను తల ఊపేను నాన్నగారి పరా మర్శకి.

"రాగానే నీళ్లూ అవీ పోసుకోకుండా యింకా అలా కూచున్నావేం రా? ఆ బట్టలూ, ఆ వేషమూ, ఎబ్బే, ఎక్కడేనా కాలేజీలో చదువుకుంటున్న పిల్లాడిలా ఉన్నావా? నీ వాలకం చూస్తే కడుపులో ఏం పడ్డట్టులేదు. స్నానంచేసి తెల్లటి బట్టలు వేసుకో. శుభ్రంగా భోంచెయ్యి."

"నాన్నగారూ....అమ్మ...."

"స్కూలికి వెళ్ళిపోయింది గదుట్రా, సాయంకాలం రాదూ?"

"అదికాదు, ఆ స్కూలు ఏదో ఎక్కడో చెప్పండి. పోనీ నేనే ఓ మారు...."

"ఎందుకురా యిలాంటివేళ అమ్మ దగ్గిరకీ? వాళ్ళకి యివాళ యిన్‌స్పెక్షను స్టార్ట యింది. బహుశా ఓ వారంపాటు జరుగుతుంది. ఏం అలా నీతో మాట్లాడే తీరికే ఉంటే శలవుపెట్టి యీ పాటికి యింటిలో ఉండదూ? ఇప్పుడు నువ్వు స్కూలికి వెళ్ళినా నీతో మాట్లాడ్డానికే అవదే? ఇంతకీ ఇంట్లో అన్నీ ఉన్నాయి కద, ఈ వేళప్పుడు అమ్మతో నీకేం పని?"

అమ్మతో నాకేం పనో నేనెలా చెప్పగలను! అమ్మ లేకుండా ఏ వేళప్పుడూ ఏ పనీ నాకు జరగదని నాన్నకి ఎలా నచ్చజెప్పను!

"ఊఁ సరే....ఆఫీసుకి సంబంధించిన ముఖ్యమైన కాగితమేదో ఇంట్లో మరచిపోయి వచ్చాను. నీ కోసం ఏం రాలేదు. నేను వెడుతున్నా"

నాన్నగారు వచ్చినట్టే వెళ్ళిపోయారు. నా కోసం ఎవరూ రానక్కర్లేదు. అమ్మే రానప్పుడు ఇంకెవరు వస్తేనేం, మానేస్తేనేం! దుఃఖం, కోపం, ఆఖరికి నీరసంగామారింది. విపరీతంగా ఆకలేస్తోందని ఆ క్షణమే గుర్తుకొచ్చింది నాకు. చుట్టూ కేరేజి గిన్నెలు పెట్టుకుని కూచున్నాను. నిమిషాల మీద ఖాళీచేసేశాను. ఇన్ని మంచినీళ్లు తాగేసరికి ఆయాసం వచ్చింది నాకు. కాస్త ఆయాసం తగ్గేసరికి ఒళ్ళు తెలియని నిద్ర కమ్ముకొచ్చింది. ఏవో మాటలతో మెలకువ వచ్చినట్టయింది.

"వద్దని చెబితే లేపుతానని కూచుంటావేం కమలా!" నాన్న గొంతుక.

"బాగుందండీ మీ వరస.........లేపనియ్యండి."

"వద్దంటే నీక్కాదూ" నాన్న లైటు ఆర్పేశారు. నాకు మెలకువ వచ్చినట్టు వాళ్ళు గుర్తించినట్టులేదు.

"మీ కఠినత్వానికి అంతూ పంతూ లేకుండా పోతున్నదేమండీ....వెర్రి నాన్న. ఎలా కడుపులో కాళ్ళు పెట్టుకు పడుకున్నాడో చూడండి....కడుపు ఎంత లోతుకు వెళిపోయిందో."

అమ్మ ఆ మాటలతో నా కోపమంతా 'ఊష్ కాకీ' అన్నట్టు ఎగిరి పోయింది. పడ్డ బాధా, అనుభవించిన ఆవేదనా అన్నీ మరచిపోయి ఒళ్ళంతా పులకరించింది.


"ఆకలేస్తే వాడే లేచి అడుగుతాడు. ఊరుకుందూ" అన్నారు నాన్న.

"ఎప్పుడో పొద్దుటనగా తెప్పించిన కారేజి. ఏం తిన్నాడో, ఏం మానేడో...."

"గిన్నెలే చెబుతున్నాయి, చూడరాదూ?"

"చూడండీ. యింక మీరు నన్నల్లరి పెట్టకండి. అంత దూరంనుంచి ఆశతో వచ్చాడు బిడ్డ....నోరారా పలకరించడానికయినా నోచుకోలేక పోయాను. పాపిష్టి దాన్ని....గేస్‌స్టవ్ మీద ఎంతసేపు వండాలి! ఓ పక్క బియ్యమూ, ఓ పక్క రెండు బంగాళ దుంపలు తరిగేసి పడేస్తాను."

"కమలా!" నాన్నగారు అరచేరు. "ఇన్నీ బోధపరుస్తే యిదా నువ్వు



చేసేది? ముందు డాబామీదకి పద....నీతో మాట్లాడాలి."

ఇందులో ఏదో ఉందని నా చిన్న బుర్రకి తట్టింది. అమ్మా నాన్న డాబామీదకు చేరిన అయిదు నిమిషాలకి మెట్ల పక్క గోడచాటున చీకట్లో ఉన్నాను నేను.

"మీకేం, చెబుతారు? ఇంత రాత్రి దాకా స్కూల్లో ఏం చేస్తున్నావని రేపు వాడడుగుతే ఏం జవాబు చెప్పమన్నారు?"

"స్కూల్లో ఏ నాటకమో అయిందనీ, రాడానికి కుదర్లేదనీ చెప్పొచ్చు. మేష్టరు గిరీ చెయ్యడమే శుద్ధ అబద్ధ మయినప్పుడు యీ చిన్న చిన్న కప్పదాట్లు ఓ లెక్కా?"

నా గుండె దడదడ కొట్టుకుంది. అమ్మ ఉద్యోగం చెయ్యడం అబద్ధమా! "ఏమో నండీ ...మొగవాళ్ళు....మీకేం చెబుతారు. నా గుండె తరుక్కుపోతోంది. ఈ క్షణం కోసం నా ప్రాణమెంత కొట్టుకుపోయిందో మీకెలా తెలుస్తుంది! ఈ రెణ్ణెల్లూ అహో రాత్రాలు వాడిప్రేమకోసం నేనెంత మొహం వాచిపోయానో మీకెలా అర్థమౌతుంది! తీరా వచ్చేసరికి....స్టేషనుకైనా వెళ్ళనియ్యకుండా....వచ్చేసరికి ఇంటి దగ్గరైనా ఉండనియ్యకుండా....నేను రాను మహాప్రభో అంటూంటే నన్ను సినిమాకి యీడ్చుకెళ్ళి ....ఇంతక్రూరమైన శిక్షకి నేనేం పాపం చేశానండీ?"

అమ్మ వెక్కి వెక్కి ఏడ్చేసింది. నాకూ ఏడుపు వచ్చేసింది. పైకి ఎక్కడ వినబడు

తుందో అని గబగబ కిందకి దిగిపోయాను. కళ్లు కడుక్కుని, ఇన్ని మంచినీళ్లు తాగి మళ్లీ అక్కడికి చేరుకున్నాను.

"మీది గుండెకాదు. నల్ల సీనాపురాయి. ఉత్తరమైనా రాయనిచ్చారు కాదు. వాడు ఉండేది మూడు రోజులు. ఓ రోజు అయే అయిపోయింది. ఈ రెండ్రోజులూ కూడా యింట్లో వంట పెట్టడానికి వల్లకాదని శాసిస్తున్నారు. ఇంటికి వచ్చిన బిడ్డని కాదని, స్కూల్లో మేష్టరీ అని మోసబుచ్చి, ఏ స్నేహితురాళ్ళ యిళ్లకో బయలుదేరి— రెండు మూడ్రోజులయితే మాత్రం.... నే నింక గడపలేనండీ.........ఈ జీవితానికి యీ ఒక్కరోజు శిక్ష చాలు. వాడికి చింత చిగురు పచ్చడి యిష్టం....బెల్లంతో చేసిన వేరుశెనక్కాయ ఉండలు యిష్టం....నా చేత్తో నన్ను వాడి కిష్టమైనవన్నీ చేసిపెట్టుకో నివ్వండి. ఎప్పుడనగా పోసుకున్నాడో నలిచి తలంటి పోస్తాను. ఏమండీ....ఒక రోజు మీ మాటవిన్నానా లేదా, ఈ రెండ్రోజులూ నా మాట మీరు వినండి....ఇంకో విషయం మీరేమీ ఆలోచించినట్టులేదు. నేను పెద్దాన్ని, ఎంత దుఃఖాన్నైనా నా కడుపులో పెట్టుకుని పైకి దెయ్యంలా తిరగ్గలను. కాని, నిన్న మొన్నటి గుంట వెధవ, మరీ యింతగా సాగదీస్తే వాడి పసి హృదయం తట్టుకోవద్దూ? క్రిందటేడు వచ్చిన జబ్బుకి బిడ్డ బ్రతికి బయట పడతాడని ఎవరైనా అనుకున్నామా? ఉన్నట్టుండి ఇంత కఠినంగా నేను ప్రవర్తిస్తే వాడు ఓర్చుకోవద్దూ?"

"అవును, నాదే పొరపాటు. హద్దులు మీరిన అభిమానం అంధకారం మాత్రమే అవుతుంది. నువ్వు నాతో సహకరిస్తావను కోడం తెలివి తక్కువ. అందరి ఆడవాళ్ళ లాగా నువ్వూ హృదయంతోనే ఆలోచిస్తున్నావు."

"ఎందుకలా బాధ పడతారు? వాడిక్షేమం నాకు అక్కర్లేదంటారా?"

"వాడి క్షేమమే నిజంగా కోరేదాన్ని వయితే యిలాగేనా వాణ్ణి తయారు చేసేది! పదహారేళ్ళు వచ్చినా పాలుతాగే పాపా యిలా వాణ్ణి తయారుచేశావు. వాడికి ఇల్లు తప్ప ఇంకో లోకం తెలీదు. ఓ స్నేహితు లంటూ లేరు. ఏ ఆటా చేతకాదు. ఏ పనీ చేసుకోలేడు. ఆఖరికి వీపు దురదవేసినా సరే 'అమ్మా గోకవే' అని నీ దగ్గిరికి పరిగెత్తుకు వచ్చేలా చేశావు. ఈ పరాధీనపు బతుకు సిగ్గు చేటయినది కాదా? ఈ వయసులో వాడి కాళ్ళ మీదవాడు ఏ చిన్న పనికయినా నిలబడలేక పోతున్నాడంటే వాణ్ణలా తయారుచేసిన బాధ్యత నీది కాదా? నిన్నే అనుకోడం ఎందుకు? నా ఆఫీసు పనేమిటో నా కేంపులేమిటో వాటిలోనే మునిగిపోయానుగాని మానసికంగా వీడి ఎదుగుదల యింతలా నిలిచిపోయిందని తండ్రిగా నేను మాత్రం ఏం గుర్తించాను! తీరా గుర్తించాక సరిదిద్దుకుందామని ప్రయత్నించాను. నీ నుంచి వేరు చేస్తేగాని

వాడికి ప్రత్యేకించి వ్యక్తిత్వం ఉండదని గుర్తించాను. నిజానికి యీ ఊళ్ళో కాలేజీ లేదనా వాణ్ణి పొరుగూరు పంపడం! పెద్దాడితో ఆలోచించి ఆ ఊరిలో పెట్టాను. ఏం లాభం! నీ అతిముద్దు వాణ్ణి వెంబడించి దాని ప్రభావం చూపిస్తూనే ఉంది. రెణ్ణెల్లయినా వాడు ఏ మాత్రం ఎడ్జస్టు అవలేక పోయాడు. అక్కడ ఉండలేక పోతున్నాననీ వచ్చేస్తాననీ నీకు రాయనే రాశాడు. రాయడం యేం ఖర్మ రెండ్రోజుల భాగ్యానికి అన్ని సామాన్లతోపాటూ వచ్చేశాడు. ఇది ఊహించే నువ్వు యింటిపట్టున ఉండి యింకా యింకా పాడు చెయ్యకుండా నీకు ఉద్యోగం అంటగట్టడం జరిగింది. ఎలాగో ఓ రోజు గడిపేవు. ఇక ఉండలేనంటావా, నీ యిష్టం. దూరం దూరంగా జరిగి బాగు చేస్తావో, దగ్గర దగ్గిరా వచ్చి పాడు చేస్తావో!"

"వాడు బాగుపడ్డం కంటే నాకు కావలసిందేముందండీ....మీ యిష్టమే ..."

"గుడ్....అలా ఇప్పటి కయినా దారికిరా....ఓ వయసు వరకే పిల్లల్ని పిల్లల్లా చూసుకోవాలి మనం ...ఆ తర్వాత వాళ్ళని పై వాళ్ళలా చూడ్డం నేర్చుకోవాలి....ఇది పెంచి పెద్ద చేసిన తల్లికి నిజంగా కష్టమే. కాని ఏం చేస్తాం? అలా చెయ్యకపోతే బాధపడేది పిల్లలే. లోకంలో అందరూ అమ్మలాంటి వాళ్ళే ఉండరు గదా! వాళ్ళ బతుకు వాళ్ళు బతకడానికి తెరవెనకనుంచి దోహదం చేసేవరకే మన డ్యూటీ!"

"మీరేమంటే అనండి...నిన్న మొన్నటి వెర్రినాగమ్మ వాడు ...వేలెడు లేని పిచ్చి వెధవ....వాణ్ణి పై వాడిలా యీ జన్మలో నేను చూడగలనా! మీరు చెప్పారు కాబట్టి ఈ రెండ్రోజులూ ఎలాగో చావాబతక్కుండా కాలక్షేపం చేస్తాను. వాడికి కాస్త మనిషిలా తిరగడం వచ్చాక యింటికి వస్తాడు కదా, బాకీతోసహా నా ప్రేమ కురిపిస్తాను. ఎంత దూరంగా ఉంటే యీ అమ్మ అంత దగ్గిర కాదుటండీ బుజ్జిగాడికి!"

అమ్మ ఏడుస్తోంది. నాన్న అమ్మని దెబ్బలాడి కిందకు తీసుకొచ్చే ప్రయత్నంలో ఉన్నారు. నేను ముందే పక్క మీదికి జారుకున్నాను.

అమ్మా నాన్నల ఆ సంభాషణ అక్షరాక్షరమూ బతికున్నన్నాళ్ళూ జ్ఞాపకముంచుకుంటాను. తల్లి మనసుకంటే చల్లనైనది ఎక్కడా ఉండదు. కాని పైకి అగ్నిపర్వతంలా కనిపించే నాన్నలో కూడా నా మీద ఎంత ప్రేమ దాగి ఉంది! నాన్నగారే కాదు, అన్నయ్యో! అన్న ఒక్కడే కాదు, ఆఖరికి వీరాస్వామో! వీళ్ళందరికీ నే నొక ప్రత్యేక వ్యక్తిగా నిలబడ్డం కావాలి. ఇంత మంది హృదయాలకి నే నంటే అంత యిష్టమైనప్పుడు, నాకేనా నే నంటే ఇష్టం లేనిది!

